విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ పంపిణీ



బ్యాగులు పంపిణీ చేస్తున్న పాల్‌రెడ్డి ఫౌండేషన్ ప్రతినిధులు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ వాంబే కాలనీలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సోమవారం పాల్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు, స్టేషనరీ అందజేశారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రతినిధి బృందం విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపతయ్య, మరుద్వతి, మంజుల, మదార్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ అండాలు, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వారాహి దేవి నవరాత్రి ఉత్సవాలు



ప్రత్యేక పూజల్లో భక్తులు

రాజేంద్రనగర్: వారాహి దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాజేంద్రనగర్ బుద్వేల్ కోట మైసమ్మ ఆలయంలో సోమవారం రాత్రి నిర్వహించిన పూజా కార్యక్రమంలో బుద్వేల్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులంతా కలిసి మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. బుద్వేల్ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం రాత్రి మహా హారతిలో పాల్గొన్నారు. వారాహి దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఆలయంలో ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. అమ్మవారిని చూడముచ్చటగా అలంకరించారు. భక్తుల కోసం ఆలయ కమిటీ నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు.

ముష్కి చెరువును కాపాడండి

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు స్థానికుల వినతి



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రం ఇచ్చిన నివాసితులు

మణికొండ: గతంలో ఎప్పుడూ లేనివిధంగా అపార్ట్‌మెంట్ల మురుగు నీటిని చెరువులో కలిపి స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్న చుట్టుపక్కల దృవాన్ష్ సంస్థ కార్యకలాపాలను వెంటనే నిలిపివేయించాలని మైహోం అవతార్, హాల్‌మార్క్ వినిసియా నివాసితులు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను సోమవారం కోరారు. గుడికి వచ్చే భక్తులు సైతం ఇబ్బందులు పడుతున్నట్లు వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా నివాసితుడు గౌతంరెడ్డి మాట్లాడుతూ గతంలో చెరువులో వరద నీరు మాత్రమే ఉండేదని, ఇప్పుడు మురుగు నీరు కలుస్తుండటంతో చుట్టుపక్కల నివసించలేని దుస్థితి ఎదురవుతోందన్నారు. వెంటనే దృవాన్ష్ సంస్థ పనులను నిలిపివేసి అక్కడి నుంచి పంపాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామన్నారు. స్పందించిన ఎమ్మెల్యే నార్సింగి, మణికొండ మున్సిపల్ కమిషనర్లు త్వరలోనే హెచ్‌ఎండీఏ అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డి, నాయకుడు శ్రావణ్‌కుమార్‌తో పాటు నివాసితులు పాల్గొన్నారు.

చినుకు పడితే ఆగమాగమే..

- రహదారిపై పొంగిపొర్లుతున్న మురుగు
- రోడ్లపై మురుగు నీటితో బండ్లగూడ జాగీర్ వాసుల తిప్పలు
- నిర్లక్ష్యం వ్యవహరిస్తున్న అధికారులు



లునెట్టా విల్లాస్ వద్ద పారుతున్న మురుగు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ పైపులైన్ ఏర్పాటు చేయకపోవడంతో మురుగునీరు రోడ్డుపై ఏరులై పారుతోంది. డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలో క్షేత్రస్థాయిలో అధికారులు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులపై పర్యవేక్షణ చేపట్టకపోవడంతో మురుగు రోడ్లపై పారుతోంది. మూడేళ్లుగా వైష్ణవి అపార్ట్‌మెంట్ పక్కన లేన్‌లో ఉన్న లునెట్టా నివాసితులు ఎన్నో అవస్థలు అనుభవిస్తున్నారు. అక్కడ అడుగు పెట్టగానే కుడివైపు ఉన్న ఓపెన్ నాలా ఉధృతంగా పారుతోంది. డ్రైనేజీ ఓవర్‌ఫ్లో కారణంగా వాహనాల రాకపోకలకు సైతం తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. జనాభాకు అనుగుణంగా పాత డ్రైనేజీ పైపులైన్ సామర్థ్యం సరిపోకపోవడంతో తరచూ అక్కడ డ్రైనేజీ పొంగి మురుగు రోడ్డుపై పారుతోంది.

పరిసరాలు అపరిశుభ్రంగా..

డ్రైనేజీ రోడ్డుపై పారుతుండటంతో ఆ ప్రాంతాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. దోమలు, ఈగలకు ఆవాసంగా మారుతోంది. దీంతో పాటు రోడ్లపై రాకపోకలు సాగించలేక వాహదారులు, పాదచారులు అనేక అవస్థలు పడుతున్నారు. ఈ రహదారిలో నడిచే వారు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి. కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీనికి తోడు వర్షం పడితే పైభాగం నుంచి భారీగా వరద వస్తుండటంతో లునెట్టా విల్లాస్, సిరి ఎన్‌క్లేవ్, పాలమూరి హైట్స్ చుట్టుపక్కల ప్రాంతాల్లోని ఇళ్లలోకి చేరుతోంది. రాత్రి సమయంలో ఇక్కడ ప్రయాణం మరింత నరకంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.



విల్లాస్‌లోకి చేరిన వర్షపు నీరు



చెరువును తలపిస్తున్న పరిసరాలు

కొత్త రోడ్డు నిర్మాణం చేయండి



అంజలిగార్డెన్ రోడ్డును పరిశీలిస్తున్న మాజీ చైర్మన్, డీఈలు

మణికొండ: ల్యాంకోహిల్స్ సర్కిల్ నుంచి లక్ష్మీనగర్, అంజలిగార్డెన్ కాలనీల మీదుగా ఉన్న రోడ్డు శిథిలమై రాకపోకలకు ఇబ్బందిగా మారిందని, కొత్త రోడ్డు నిర్మాణం చేపట్టాలని డీఈ శివసాయిని మణికొండ మున్సిపల్ మాజీ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్ కోరారు. కాలనీవాసుల కోరిక మేరకు రోడ్డు, కమ్యూనిటీహాల్ మిగులు పనులు, ప్యాచ్ వర్క్‌లు చేయాల్సిన ప్రాంతాలను సోమవారం నరేందర్‌ముదిరాజ్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాలు కురిసే లోపు రోడ్డు పనులను పూర్తి చేస్తేనే ప్రజలకు అనుకూలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు జితేందర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కిరణ్‌కుమార్, మాజీ కౌన్సిలర్ పురుషోత్తం, నాయకులు మల్లేష్, తాజుద్దీన్, అంజలిగార్డెన్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు హనుమంత్‌కుమార్, నాయకులు కాశీనాథశాస్త్రి, అనిత, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరకాలనీలో రోడ్లు వేయించండి



ఎమ్మెల్యేను కలిసిన వెంకటేశ్వర కాలనీవాసులు

మణికొండ: తమ కాలనీలో ఇంటి నిర్మాణాలు జరిగి ప్రజలు నివసిస్తున్నా రోడ్లు, వీధి దీపాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అనేక సార్లు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి వెళ్లినా పట్టించుకోవడం లేదని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని వెంకటేశ్వరకాలనీ వాసులు ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌కు మొరపెట్టుకున్నారు. ఆయనను కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. అన్ని కాలనీల్లో అన్ని రకాల అభివృద్ధి పనులు జరిగినా తమను చిన్నచూపు చూస్తున్నారన్నారు. రాత్రి సమయం, వర్షాకాలంలో ఇంటికి వచ్చేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దాంతో ఎమ్మెల్యే వెంటనే మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి కాలనీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. రాబోయే రోజుల్లో నిధుల లభ్యతను బట్టి కాలనీ సమస్యలు పరిష్కరించాలని సూచించారు. త్వరలోనే మున్సిపాలిటీకి వస్తున్నానని, అప్పుడు అధికారులతో కలిసి సమస్యలపై సమీక్ష నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆల్ కాలనీస్ ఫెడరేషన్ కోశాధికారి రవీందర్‌రెడ్డి, వెంకటేశ్వర కాలనీవాసులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులను ప్రోత్సహించాలి



నోట్‌బుక్స్ అందజేస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ నరేందర్

మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

మణికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు అందరూ అండగా ఉండాలని మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన ఎం.రేష్మ, కె.కావ్య, వి.స్వాతి, గణేష్, డి.సాయిప్రియ, కె.సత్యశ్రావణికి స్థానిక వీఆర్‌ఫర్‌యు సీనియర్ సిటిజన్ సంస్థ నగదు పురస్కారం, ట్రోఫీ, ప్రశంసాపత్రాలను ఆయన చేతులమీదుగా అందజేశారు. వైస్ చైర్మన్‌తో పాటు మాజీ కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డి ఇద్దరు పేద విద్యార్థుల ఇంటర్ చదువులకు తమవంతు ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నిరంజన్, వీఆర్‌ఫర్‌యు అధ్యక్షుడు బాపూజీ, కార్యదర్శి డి.సీతారాందాస్, సభ్యులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా ఉండాలి

మణికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పించి అండగా ఉండాలని మణికొండ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్ కోరారు. పుప్పాలగూడ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పార్టీ నాయకులు మహేష్‌బాబు, మహేశ్వర్‌రెడ్డి సొంత డబ్బులతో సోమవారం నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు ఎం.జితేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్, నాయకులు పురుషోత్తం, తాజుద్దీన్, మల్లేష్, ప్రభావతి, సావిత్రి, శ్రీకాంత్‌రెడ్డి, నాగరాజు, ప్రధానోపాధ్యాయుడు మాంగ్యానాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలతో లబ్ధిపొందాలి



వట్టినాగులపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభిస్తున్న ప్రదీప్‌కుమార్

మణికొండ: ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎం.ప్రదీప్‌కుమార్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లిలో దార రాజు, పి.మల్లేష్, పి.లలితకు ఇందిరమ్మ గృహాలు మంజూరు కావడంతో వార్డు ఇన్‌చార్జి లచ్చిరాంతో కలిసి సోమవారం ముగ్గుపోసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు లేని వారికి ఇందిరమ్మ గృహ పథకం ఎంతో మేలు చేస్తుందని, అవసరం అయిన వారందరికీ మంజూరు చేస్తోందన్నారు. రాబోయే రోజుల్లో మిగిలిన పథకాలను అమలు చేసేందుకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు అభిలాష్, రాము తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

రూ.65,890 నగదు, 12 బైకులు స్వాధీనం



పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు

శంషాబాద్ రూరల్: పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటి పరిధిలోని ఊటీపల్లి శివారులో ఉన్న సదరన్ వెంచర్‌లో ఖాళీ స్థలంలో సోమవారం కొంతమంది పేకాట ఆడుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. 13 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి నుంచి రూ.65,890 నగదు, 12 బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

బండ్లగూడ: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కాలనీల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ ప్రశాంత్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. కాలనీలోని సమస్యలపై సోమవారం కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్‌కు డ్రైనేజీ లైన్ కనెక్షన్ లేకపోవడంతో సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. కాలనీలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి శానిటేషన్ చేయించాలన్నారు. కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు చక్రవర్తి, ప్రధాన కార్యదర్శి విజయ్‌ఠాకూర్, ఉపాధ్యక్షులు అనిల్‌కుమార్ మోర్, బుర్ర తిరుమల్లేష్, సంయుక్త కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, సభ్యులు మనీష్ దూబే, ఇక్బాల్ ఖషీఫ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సంక్షేమ పథకాలపై కరపత్రాల పంపిణీ



పాండురంగానగర్‌లో కరపత్రాలను పంపిణీ చేస్తున్న సులిగే వెంకటేష్ తదితరులు

అత్తాపూర్: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలతో ప్రజలంతా అభివృద్ధి చెందుతున్నారని బీజేపీ అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు సులిగే వెంకటేష్ అన్నారు. డివిజన్ పరిధిలోని పాండురంగానగర్‌లో ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ విజయ్‌కుమార్, జి.రాజు, పి.వెంకట్‌రెడ్డి, శశికాంత్‌శర్మ, విమల్‌శర్మ, నరేష్, ముఖేష్, బిరాధర్, విజయ్, స్వామి, విజయరావత్, ఉమా, వెంకటేష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్య

గచ్చిబౌలి: ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ శంకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి జిల్లా పానగల్ మండలం గోపాలపురం ప్రాంతానికి చెందిన విజయ్(23) గోపన్‌పల్లిలో నిర్మాణ సంస్థలో ట్రాక్టర్‌ను అద్దెకు నడుపుతున్నాడు. ఎన్టీఆర్ నగర్‌లోని జైశ్రీరామ్ మెన్స్ పీజీ హాస్టల్‌లో నివాసం ఉంటున్నాడు. రూమ్ నంబర్-23లో దుర్వాసన రావడంతో ఆదివారం రాత్రి 7 గంటలకు హాస్టల్ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తలుపు లు తెరిచి చూడగా అతడు సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమార్కుల చెరవీడిన సర్కారు భూమి



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సుల్తాన్‌పల్లివాసులు



సుల్తాన్‌పల్లిలో అక్రమార్కుల చెరవీడిన సర్కారు భూమి

శంషాబాద్ రూరల్: సర్కారు భూమిని పట్టాగా మార్చి అమ్మకాలు చేపట్టగా.. స్థానికుల చొరవతో సుమారు రూ.30 కోట్ల విలువ చేసే భూమితో పాటు కుంట అక్రమార్కుల చెర వీడింది. శంషాబాద్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని సుల్తాన్‌పల్లిలో సర్వే నంబర్-129లో 16 ఎకరాల 24 గుంటలు, సర్వే నంబర్-142లో 8 ఎకరాల 26 గుంటలు బిలా దాఖలు(సర్కారు) భూమి ఉంది. సర్వే నంబర్-129లో ఉన్న భూమిలో బోడవోని కుంట ఉంది. ఇందులో 14 ఎకరాల 20 గుంటలు ఎఫ్‌టీఎల్‌లో ఉంది. ఇదిలా ఉండగా.. ఈ భూములపై తమకు హక్కులు ఉన్నట్లు కొంతమంది 2005లో పట్టాపాసు పుస్తకాలు పొందారు. అనంతరం ఈ భూములను సదరు పట్టాదారులు మరొకరికి అమ్మేశారు. దీంతో చేవెళ్ల ఆర్డీఓ ఈ భూములు ప్రభుత్వానికి చెందినవంటూ 2007లో ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో సర్వే నంబర్-142లో ప్రభుత్వం స్థానికులకు ఇళ్ల పట్టాలు జారీ చేసింది. దీంతో పట్టాదారులు ఈ విషయమై హైకోర్టుకు వెళ్లారు. అక్కడ కూడా వీరికి ప్రతికూల తీర్పు వచ్చింది. తర్వాత ఇక్కడి బోడవోని కుంటలో మిషన్ కాకతీయ పథకంలో పూడికతీత, కట్ట మరమ్మతులు చేపట్టారు. కొన్నాళ్లకు పట్టాదారులకు కొత్త పాసు పుస్తకాలు కూడా జారీ అయ్యాయి. దీంతో స్థానికులు వై.సిద్దేశ్వర్, ఎం.లక్ష్మయ్య ఈ విషయమై సీసీఎల్‌ఏలో ఆధారాలతో ఫిర్యాదు చేశారు. రికార్డులను పరిశీలించి, విచారణ చేపట్టిన సీసీఎల్‌ఏ నవీన్‌మిట్టల్ ఈ భూములు ప్రభుత్వానికి చెందినవంటూ, వీటి సంరక్షణ చర్యలు చేపట్టాలంటూ రెవెన్యూ అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు ఇటీవలే తహసీల్ కార్యాలయానికి చేరినట్లు.. అక్కడ బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులకు కోరామని వారు వెల్లడించారు. సమావేశంలో మాజీ సర్పంచులు వై.సిద్దేశ్వర్, డి.ఇస్తారి, స్థానికులు లక్ష్మయ్య, ప్రభాకర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.